క్లుప్తంగా

వీరేశ్వరస్వామిని దర్శించుకున్న ఆర్డీఓ



ఆర్డీఓకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న అర్చకులు

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామిని అమలాపురం నూతన ఆర్డీఓ జి.కేశవవర్ధన రెడ్డి ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

డిపార్ట్‌మెంటల్ టెస్ట్ వాయిదా

యానాం: అప్పర్ డివిజినల్ క్లర్క్‌లకు ఈ నెల 29న నిర్వహించాల్సిన డిపార్ట్‌మెంటల్ పోటీ పరీక్షను డిసెంబర్ 3కు వాయిదా వేసినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి వి.జయశంకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నిత్యావసర సరకుల అందజేత



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి దోలామణి దంపతులు

అమలాపురం రూరల్: మండలంలోని రోళ్లపాలెంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన రాయుడు సత్తిబాబు కుటుంబ సభ్యులకు ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి దంపతులు నిత్యావసర సరకులు అందజేశారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వాసంశెట్టి సత్యనారాయణ, గుబ్బల నాగేశ్వరరావు, రాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం



బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కామేశ్వరరావును సత్కరిస్తున్న అనిల్‌కుమార్ జైన్ తదితరులు

అమలాపురం రూరల్: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పేరి కామేశ్వరరావును లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోకవరపు మల్లిఖార్జున స్వామి, కార్యదర్శి చిక్కాల సతీష్, ఉమెన్ అండ్ యూత్ క్యాంపెనింగ్ వింగ్ ఇండియా కోఆర్డినేటర్ అనిల్ కుమార్ జైన్, డిస్ట్రిక్ట్ జోన్ చైర్మన్ జంపన సుమన్ వర్మలు ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛంతో ఆదివారం సత్కరించారు. కార్యక్రమంలో సుగ్గు గోపి, జంపన సూర్య తేజ, రవణం వేణుగోపాలరావు, పెనుమాల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పదవీ కాలం పొడిగింపుపై హర్షం



వడ్డి రఘురామ్‌ను సత్కరిస్తున్న ఆక్వా రైతులు

అమలాపురం రూరల్: ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా వడ్డి రఘురామ్ పదవీ కాలం పొడిగింపుపై కోనసీమ ఆక్వా రైతుల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. రఘురామ్‌ను కోనసీమ ఆక్వా రైతుల సంఘం నాయకులు ఆదివారం కలిసి సత్కరించి అభినందనలు తెలియజేశారు. రఘురామ్‌ను కలిసినవారిలో ఆక్వా రైతుల సంఘం నాయకులు చవటపల్లి నాగభూషణం, సత్తి శ్రీను, ఎం.కిరణ్ కుమార్‌లున్నారు.

తాచుపాము హల్‌చల్



రాజు ఇంట్లోకి చొరబడిన తాచుపాము

ఐ.పోలవరం: మండలంలోని పశువుల్లంక రాజులవీధికి చెందిన పిన్నమరాజు తిరుపతి రాజు ఇంట్లోకి ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో తాచుపాము ప్రవేశించింది. పామును చూసిన రాజు కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన స్నేక్‌కేచర్ గణేష్‌వర్మకు సమాచారం ఇచ్చారు. వర్మ వెంటనే అక్కడకు చేరుకుని పామును డబ్బాలో బంధించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అడుగడుగునా నిఘా నేత్రం

- ఏడు వీధుల దసరా ఊరేగింపులకు ఏర్పాట్లు పూర్తి
- ఉత్సవాల్లో సీసీ కెమెరాలతో పోలీసుల పర్యవేక్షణ



అమలాపురంలో జరుగుతున్న దసరా ఉత్సవాలకు హాజరైన ప్రజలు(ఫైల్)

అమలాపురం టౌన్: పట్టణంలో ఈ నెల 25న జరగనున్న ఏడు వీధుల దసరా ఉత్సవాల ఊరేగింపుల ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలీసుల పహారా మధ్య ఊరేగింపులు, చెడీ తాలింఖానా ప్రదర్శనలు జరగనున్నాయి. ఇద్దరు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 30 మంది ఎస్సైలు 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీసీ కెమెరాలతో ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. దసరా ఊరేగింపుల బందోబస్తు వివరాలను అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆదివారం సాయంత్రం 'సాక్షి'కి వెల్లడించారు.

కంట్రోల్ రూమ్.. నిర్విరామంగా పెట్రోలింగ్

ఈ నెల 25వ తేదీ సాయంత్రం నుంచి ఏడు వీధుల ఊరేగింపులు ఆయా వీధుల్లో మొదలై ప్రధాన పుర వీధుల్లో ఊరేగి మర్నాడు తెల్లవారుజామున ముగుస్తాయి. ఈ ఏడు వీధుల ఊరేగింపుల సమ్మేళనాన్ని తిలకించేందుకు జిల్లావ్యాప్తంగా వేలాది మంది తరలిరానున్న దృష్ట్యా ట్రాఫిక్, పార్కింగ్ పరంగానూ పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఊరేగింపుల పర్యవేక్షణకు డీఎస్పీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఏడు వీధుల ఊరేగింపుల కదలికలను కంట్రోల్ రూమ్‌లో ఉండి పోలీసులు గమనిస్తారు. ఊరేగింపుల్లో చెడీ తాలింఖానా ప్రదర్శకులు వినియోగించే పట్టా కత్తులు, అగ్గి బరాటాలు, డాళ్లు, లేడి కొమ్ములు, కర్రలు తదితర ఆయుధాలకు పోలీసు గుర్తింపు స్టిక్కర్లు అతికించారు. ఈ పోలీసు స్టిక్కర్లు ఉన్న ఆయుధాలను మాత్రమే ప్రదర్శనలో ఉపయోగించేలా ఏడు వీధులు ఉత్సవ కమిటీలకు పోలీసులు ఆంక్షలు విధించారు. గీత దాటి ఆయుధాలను ఉపయోగించేందుకు ప్రయత్నిస్తే వాటిని అక్కడిక్కడే సీజ్ చేసి తక్షణమే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పోలీసు నిబంధనలకు లోబడి ఊరేగింపులు సాగేలా ఇప్పటికే పోలీసులు ఏడు వీధుల కమిటీలకు 149 సీఆర్‌పీసీ ప్రకారం నోటీసులు కూడా జారీ చేశారు.

47 మంది రౌడీ షీటర్లపై బైండోవర్ కేసులు

దసరా ఊరేగింపుల్లో అల్లర్లు సృష్టించకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా పట్టణంలో ఉన్న 47 మంది రౌడీ షీటర్లపై ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఊరేగింపుల్లో అశ్లీల నృత్యాలు, భారీ బాణసంచా కాల్పులు, డీజేలు వంటివి ఉండడానికి వీల్లేదని పోలీసులు ఉత్సవ కమిటీలకు స్పష్టం చేశారు. ఏడు వీధులకు సంబంధించి ఒక ఊరేగింపుతో మరో ఊరేగింపు కలిసినప్పుడు వివాదాలకు తావు లేకుండా ప్రతి ఊరేగింపు మధ్య భారీ పోలీసు వలయాన్ని ఏర్పాటుచేశారు. అమలాపురం పట్టణంలో ఈనెల 25న ఊరేగింపులు జరుగుతుంటే అల్లవరం మండలం బోడసకుర్రులో ఈ నెల 23న జరుగుతున్నాయి. అలాగే అమలాపురం రూరల్ మండలం పేరూరులో ఓ సామాజిక వర్గ దసరా ఊరేగింపు 24వ తేదీన, మరో సామాజిక వర్గ ఊరేగింపు ఈ నెల 26న నిర్వహించేందుకు ఆయా ఉత్సవ కమిటీలు నిర్ణయించాయి. దీంతో ఆ రెండు గ్రామాల్లో జరిగే మూడు ఊరేగింపులకు దాదాపు 250 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసినట్లు డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు.

కూచిపూడి నృత్య బృందానికి సత్కారం



నృత్య బృందాన్ని సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా స్థానిక శ్రీదేవి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో ఉత్సవాల్లో నాలుగు పౌరాణిక నాటకాలు, నాలుగు సాంఘిక, జానపద, ఆధ్యాత్మిక నృత్య రూపకాలు ఏర్పాటయ్యాయి. అమ్మవారి ఉత్సవాల వేదికపై హైదరాబాద్ కూకట్‌పల్లికి శ్రీభాస్కర అకాడమీకి చెందిన దాదాపు 20 మంది కళాకారిణులు 'మహిషాసుర మర్ధిని' నృత్య రూపకాన్ని ఆదివారం ప్రదర్శించారు. నృత్య బృందాన్ని ఉత్సవ కమిటీ ప్రతినిధులు గంగాబత్తుల దొర బాబు, వెలిగట్ల జగదీష్ తదితరులు ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

యోగాశ్రమ సేవలు అభినందనీయం



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ అంబికాప్రసాద్ తదితరులు

అమలాపురం టౌన్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులు, క్షతగాత్రులకు రక్తదానం చేయడమే కాకుండా పరావరణ పరిరక్షణకు మొక్కలు నాటుతూ సామాజిక చైతన్యంతో పనిచేస్తున్న అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం సేవలు అభినందనీయమని డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ అన్నారు. యోగాశ్రమ గురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వెయ్యి మొక్కలను నాటే కార్యక్రమాన్ని డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆదివారం ప్రారంభించి ప్రసంగించారు. తొలుత స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద గల యోగాశ్రమం ప్రాంగణంలో డీఎస్పీ మొక్కలు నాటారు. అనంతరం యోగాశ్రమ సభ్యులు, విద్యార్థులు పలు ఆలయాలు, నివాస గృహాల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంస్కార భారతి ప్రతినిధులు అయినవిల్లి కామాక్షమ్మ, పుత్సా కృష్ణ కామేశ్వర్, పట్నాల శైలజ, నేమాని అపర్ణ, గ్రంధి లక్ష్మి, దువ్వూరి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి పుట్టినరోజు వేడుక



శతాధిక వృద్ధురాలు సూర్యకాంతంతో కుటుంబ సభ్యులు

ముమ్మిడివరం: మండలంలోని అన్నంపల్లిలో శతాధిక వృద్ధురాలు ఇండుగుల సూర్యకాంతం 100వ పుట్టినరోజు వేడుకలు ఆదివారం కుటుంబసభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అమెరికా, కెనడా, మలేషియా, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన నలుగురు కుమారులు, కోడళ్లు, ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు, మనవలు, మనవరాళ్లు, మునిమనవళ్లు, మునిమనవరాళ్లు కలిపి మొత్తంగా 56 మంది కుటుంబ సభ్యుల సమక్షంలో వేడుకలు జరిపారు.

పట్టణం మధ్యలోనే బాణసంచా దుకాణాలు

బెంబేలెత్తుతున్న స్థానిక ప్రజలు

యానాం: పట్టణంని నివాసాలు, పెట్రోల్ బంకులు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో నిర్వహిస్తున్న హోల్‌సేల్ దీపావళి సామగ్రి షాపులతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీపావళికి ఇంకా సమయమున్నా గత రెండు నెలలుగా ఐదు హోల్‌సేల్ దుకాణాల్లో బాణసంచా విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. అక్కడే లక్షలాది రూపాయల బాణసంచా సామగ్రి గొడౌన్‌లు సైతం నిర్వహిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నివాస ప్రాంతాల్లో దీపావళి దుకాణాలు నిర్వహించడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో బాణసంచా షాపులకు ఫైర్ అండ్ సేఫ్టీ అధికారులు అనుమతులు ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

వచ్చే నెల 1న జాతీయ జెండా ఎగురవేయాలి

యానాం: నవంబర్ 1వ తేదీన పుదుచ్చేరి లిబరేషన్ డే సందర్భంగా పుదుచ్చేరి, మాహే, కారైకల్, యానాం నాలుగు రీజియన్‌ల్లోని అన్ని పాఠశాలల్లోనూ జాతీయ జెండాను ఎగురవేయాలని పుదుచ్చేరి విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ మునిస్వామి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. పుదుచ్చేరి విముక్తి దినోత్సవ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించాలని కోరారు.

కోదండ రామాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం



కోదండ రామాలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమంలో పూజలు చేస్తున్న సర్పంచ్ చింతలపాటి అనూష దంపతులు

తాళ్లరేవు: మండలంలోని పిల్లంక పంచాయతీ శివారు కొత్తలంకలో శ్రీకోదండ రామాలయ పునః ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక ఎస్సీ పేటలో సుమారు రూ.10 లక్షల తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సాయంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేత చింతలపాటి శ్రీనివాసరాజు, పిల్లంక సర్పంచ్ చింతలపాటి అనూష దంపతులు విశేష పూజలు చేశారు. అనంతరం శ్రీసీతారామ, లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు మోర్త బీమాబాయి, ఉపసర్పంచ్ కాగిత రాజు, కొపనాతి నాగరాజు, కూరాటి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి రూ.1.71 లక్షల వితరణ



విద్యార్థిని పావని శ్వేతకు చెక్కు అందిస్తున్న దాత దొర రాజు తదితరులు

అమలాపురం రూరల్: అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పావని శ్వేతకు ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(కాట్వా) ఆధ్వర్యంలో హైదరాబాద్ అయిల్ స్వీట్స్ దొర రాజు సహకారంతో మొదటి ఏడాది ఫీజు చెల్లించేందుకు రూ.1.71 లక్షల చెక్కును ఆదివారం అందజేశారు. దొర రాజు వితరణను కాట్వా సంఘ ప్రతినిధులు అభినందించారు.

కనకదుర్గాదేవి.. నమోస్తుతే..



కూనవరంలో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



సన్నవిల్లిలో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



కనకాలపేటలో దుర్గాదేవిగా అలంకరణలో శ్రావణి అమ్మవారు

- భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు
- కిటకిటలాడుతున్న అమ్మవారి ఆలయాలు

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరం పంచాయతీ శివారు గ్రాంటు గ్రామంలో పాల కనకదుర్గమ్మ అమ్మవారిని పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. తాళ్లరేవు ప్రధాన రహదారిలో ఉన్న శ్రీవాసవీమాత ఆలయం, కనకదుర్గ ఆలయం, జార్జిపేట దుర్గామల్లేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నీలపల్లి మండపంలో అమ్మవారిని విజయదుర్గా దేవిగా అలంకరించి పూజలు చేశారు.

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి, గొల్లవిల్లి, సన్నవిల్లి, భీమనపల్లి, ఉప్పలగుప్తం, వానపల్లిపాలెం, ఎస్.కొత్తపల్లి, కూనవరం గ్రామాల్లో శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం అమ్మవారు దుర్గామాత అవతారంలో దర్శనమిచ్చారు. ఉప్పలగుప్తంలో దేవి సెంటర్‌లో ఉన్న దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద మహిళలు, యువతులు దీపోత్సవం నిర్వహించారు

యానాం: పట్టణంలో కొలువైన శ్రీలలితాదేవి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కనకాలపేటలో శ్రావణి అమ్మవారు, గోపాల్‌నగర్‌లో శ్రీశారదాదేవి అమ్మవారు, దొమ్మేటిపేటలో కనకదుర్గాదేవి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఐ.పోలవరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. మురమళ్ల వాసవీ కన్యాకాపరమేశ్వరి సత్రంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని లక్ష కుంకుమార్చన చేశారు. ఉదయం మేళతాళాలతో గ్రామోత్సవం, పండితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన, అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. టి.కొత్తపల్లిలో విజయదుర్గా ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. కేశనకుర్రు కామేశ్వరి అమ్మవారి ఆలయంలో అధిక సంఖ్యలో మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు.

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి ఆలయంలో అమ్మవారు, హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీకల్యాణ దుర్గ అమ్మవారు, మెయిన్ రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల శ్రీ వైష్ణవీ కనకదుర్గ ఆలయంలో అమ్మవారు, స్థానిక నల్లావీధిలో శ్రీవిజయదుర్గ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు.



గ్రాంటు గ్రామంలో పాల కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు



ఉప్పలగుప్తంలో దీపోత్సవం చేస్తున్న మహిళలు



మురమళ్ల వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన చేస్తున్న మహిళలు